# చెట్లుకూలుతున్న వృక్షం

## శ్రీపతి

**'ఒరేయ్ దీక్షితులూ, వీడెవడో పోల్చుకున్నావా?'**

**చలి ముదిరి ఎముకలు జివ్వుమంటున్న ఢిల్లీలో కేవలం ముతక నూలు దుస్తులతో వచ్చి పలకరిస్తున్న ఆ పెద్దమనిషిని దీక్షితులు ఒకంతట పోల్చుకోలేకపోయాడు. అంత చనువుతో తెలుగులో దీక్షితులను పిలిచేవాళ్ళు ఈ ఢిల్లీలో లేరు.**


ఆ వచ్చిన పెద్దమనిషి తన వయసువాడే. మెడ మీద పడుతున్న నెరసిన జుత్తూ, పెరిగిన పొడుగాటి గెడ్డమూ, ప్రకాశిస్తున్న రాగి రంగు శరీరచ్ఛాయతో కండ్ల ముందే వున్నా దీక్షితులు ఆయన్ని గుర్తుపట్టలేకపోయాడు. జనవరి నెల నాలుగు డిగ్రీల సెల్సియస్ చలికి కేవలం చొక్కా, పైజామాలతో, చెప్పులతో వచ్చి ఆ పెద్దమనిషిని చూసి నాలుగు తొడుగల ఉన్ని దుస్తులతో వెచ్చగా ఇంట్లో వున్న దీక్షితులు, మాట్లాడుతున్న టెలిఫోన్‌ని పక్కకి పెట్టి ఎదురువచ్చాడు. డాక్టర్ సత్యం ఆ పెద్దమనిషిని తన దగ్గరకు తీసుకురావడాన్నిబట్టి ఆ వచ్చిన పెద్దమనిషి తన చిన్ననాటి స్నేహితుడు కావచ్చులే అని సంబరపడ్డాడు దీక్షితులు.

'పోల్చుకోలేవులే. సత్యం ముందే చెప్పి వీడిని ఇక్కడకు తీసుకువచ్చినందువల్ల చిన్ననాటి దీక్షితులును పోల్చుకోగలిగాను. అదే ఈ పత్రికా రచయిత ఏ కన్నాట్ ప్లేస్‌లోనో, లేదా కరోల్ బాగ్‌లోనో కన్పించాడనుకో -వీడు పోల్చుకోగలిగే వాడేనా?

దీక్షితులు సాదరంగా లోపలికి తీసుకువెళ్ళాడు ఆ పెద్దమనిషిని.

సత్యం ఇంటి మనిషిలా చనువుగా వెళ్ళి ఓ మూల టెలిఫోన్ దగ్గర పడి వున్న గార్డియన్, వాషింగ్టన్ పోస్ట్ లాంటి విదేశీ న్యూస్‌పేపర్లు తెచ్చుకుని సోఫాలో కూచున్నాడు. హాల్‌లో నేలంతా పరచుకున్న ముదురు ఆకుపచ్చరంగు మెత్తటి తివాచీ. నేలను తాకే లేత నీలంరంగు కిటికీ తెరలు, అలంకారంగా జాడీల్లో పెట్టిన పచ్చటి మొక్కలు. ఓ మూలన మూడడుగుల ఎత్తు రోజ్‌వుడ్ స్టూల్ మీద చోళుల కాలం నాటి కాంస్య నటరాజవిగ్రహం. మెట్ల గది అరుగు మీద ఒక స్త్రీ మూర్తి నిలువెత్తు శిల్పం, రెండు అందమైన బీరువాల్లో నిండా కొత్త పుస్తకాలు, గాంధీ మహాత్మునితో మాట్లాడుతున్న పైలాపచ్చీస్ వయసువాటి దీక్షితుల ఫోటో, తెలుపు నలుపుల్లో నాలుగు పెయింటింగ్స్. అమృతా షెర్‌గిల్, ఎం.ఎఫ్.హుస్సేన్, రామ్‌కుమార్, శైలజ్ ముఖర్జీ...

'వీడు అవతారం రా. విశాఖపట్నం ఎ.వి.ఎన్. కాలేజీ హైస్కూల్‌లో ఈ ఇద్దరు స్నేహితులు కలిసే చదువుకున్నారు. దీక్షితులు ఫోర్త్‌ఫార్మ్ పరీక్ష రాసేసి వాళ్ళ నాన్నగారితో మద్రాసు వెళ్ళిపోయాడు. తర్వాత ఈ నేస్తాలు కలుసుకోనేలేదు. దీక్షితులు నాన్నగారు స్వరాజ్యం వాళ్ళతో జైలుకు వెళ్ళినట్టు పత్రికల్లో చదవడం ఇంకా గుర్తుంది. దీక్షితులు చదువు ముగించక ముందే కాంగ్రెస్‌లో చేరి జాతీయ పతాకం పట్టుకుని పోలీసు దెబ్బలనీ, జైలుశిక్షలనీ అనుభవించాడనీ పత్రికల్లో వార్తలు వచ్చేవి. మొట్టమొదట కృష్ణంరాజు అనుకుంటాను దీక్షితులు హిందూ పత్రికలో రిపోర్టర్‌గా చేరేడని చెప్పాడు. దీక్షితులు తర్వాత కొన్నాళ్ళు బొంబేలో మరో ఇంగ్లీషు పత్రికలో చేరేడని, తర్వాత లక్నో వెళ్ళాడని, అక్కడి నుంచి ఢిల్లీ వచ్చాడని — వాడి భోగట్టాలు వీడు వింటూనే వున్నాడు. కొంతకాలం లండన్‌లో ఒక పెద్ద పత్రికలో పనిచేసి వచ్చాడని కూడా తెలిసింది. వాడు ఎడిటర్ అయిన ప్రతి పత్రికనూ తెప్పించుకునో లేదా హిందూ రీడింగ్ రూమ్‌వాళ్ళకి చెప్పి తెప్పించో లేదా ఆంధ్రా యూనివర్సిటీ లైబ్రరీలో చదివో, ఆ పత్రిక ప్రతి పేజీలో తన చిన్ననాటి నేస్తం రూపం చూసి వీడు ఉప్పొంగిపోయేవాడు. దీక్షితులుకు అవతారం రాసిన ఉత్తరాలు కొన్ని సగంలో, కొన్ని పోస్టుకు అంతా సిద్ధంచేసి - ఇంకా వున్నాయి వీడి ఫైల్స్‌లో దాదాపు ఏభై అయిదేళ్ళ తర్వాత ఈ స్నేహితులు తొలిసారి ఈ డాక్టరుగారి సహాయంతో కలుసుకోవడం. ఇప్పుడు అవతారంకి అరవై ఎనిమిది ఏళ్ళు నిండాయి. దీక్షితులదీ అదే వయసు. అప్పట్లో క్లాసులో వీళ్ళిద్దరే చిన్నవాళ్ళు. లెక్కల మేష్టరు నారాయణస్వామిగారు ఈ ఇద్దర్నీ ఎప్పుడూ క్లాసులో మెచ్చుకునేవారు. పోల్చుకున్నావా?''




''ఇన్ని ఆనమాలు చెప్పాల్నా?''

తెలుగుదేశాన్ని నాలుగు దశాబ్దాల కిందట విడిచి పెట్టేసిన దీక్షితులు తెలుగు భాషను ఎంతో అభిమానంగా కాపాడుకుంటూ వచ్చాడు. తెలుగువాళ్ళతో తెలుగులో మాట్లాడడం ఎంతో ఇష్టం. తెలుగు స్నేహపు మాటలు చెవిని సోకే సరికి అతడి హృదయం మంచులో తడిసిన పువ్వులా ఆర్ద్రమయింది.

ఏభై అయిదేళ్ళ జ్ఞాపకాల అట్టడుగున పడివున్న స్నేహసౌందర్యాన్ని, విచ్చుకుంటున్న బాల్యాన్ని అవతారం ముఖంలో చూసి మురిసిపోయాడు దీక్షితులు.

'అవునవును. ఎ.వి.ఎన్. కాలేజి చింతచెట్టు కింద మనం ఆడుకునేవాళ్ళం'' అన్నాడు దీక్షితులు.

'ఒరేయ్ దీక్షితులూ ఆ చింతచెట్టు ఇప్పుడు లేదురా. దాదాపు ఇరవైయేళ్ళ కిందట ఓ వర్షాకాలంలో ఇట్టే కూలిపోయిందిరా. ఎన్నో గాలివానలకు లెక్క చెయ్యని చింతచెట్టు ఒక వర్షపు రాత్రి కూకటివేళ్ళతో కూలిపోయిందిరా' అన్నాడు అవతారం.

తల్లిలాంటి చెట్టు కూలిపోయినందుకు తల్లడిల్లి పోయాడు దీక్షితులు. ఆ కాలేజీ ఆవరణలో ప్రవేశ ద్వారం దగ్గర వచ్చని ఆ చెట్టు అందం కళ్ళలో విరిచి పోయింది. అంతలో టెలిఫోన్ సంగతి గుర్తుకొచ్చి అటు -టువెళ్ళి టెలిఫోన్ అందుకుని ''నువ్వు రాష్ట్రపతిని కలుసుకున్న తర్వాత రాత్రికి ఇక్కడికి రా. విషయాలు మాట్లాడుకుందాం'' అని టెలిఫోన్ పెట్టేశాడు దీక్షితులు. ఫోన్‌లో తెలుగులోనే మాట్లాడడంతో అవతలి వాడు ఎవరో తెలుగు పెద్దమనిషే అని బోధపడింది అవతారంకి.

ఈ కథ సత్యంకి తెలిసిందే. రాజ్యసభలో సభ్యత్వం కోసం ఒక తెలుగు దిన పత్రిక సంపాదకుడి పాట్లు. ముగ్గురున్న జాబితాలో అతడి పేరు చేరింది. ఈ రెండు మూడు రోజుల్లో ప్రకటిస్తారు. ప్రధాన మంత్రి కార్యాలయంలో కూడా మొగ్గు అతడికే వుంది. ఈ పార్ల



మెంట్ సభ్యత్వం వస్తే కొడుకులకూ, కూతుళ్ళకూ, అల్లుళ్ళకూ ఉన్నత పదవులూ, పరిశ్రమలూ, పెద్ద పెద్ద ఏజెన్సీలూ సంపాదించుకోవచ్చని ఆ సంపాదకుడి ఎత్తుగడ. దానికి పునాదిగా గత మూడేళ్ళనించి ప్రతిపక్షాల మీద దండెత్తి పాలక పక్షం మన్ననలు పొంది ఈ దశకు చేరాడు. ఆంధ్రదేశంలో పెద్ద పేరున్న సంపాదకుడి నిజ రూపం దీక్షితులు దగ్గర సత్యం చూసి విభ్రాంతి చెందాడు. ఘనతవహించిన ఆ సంపాదకుడిని దీక్షితులు సహించడం భరించలేక సత్యం ఓసారి నిలదీస్తే 'నా చుట్టూ వున్నవాళ్ళంతా వాళ్ళే' అని బాధపడతాడు.

ఇంకా ఉదయం ఎనిమిది గంటలన్నా కాలేదు, దీక్షితులు ఫుల్‌సూట్‌లో వున్నాడు. దాంతో సత్యంకి సందేహం కలిగింది. బైటికి బయల్దేరే కార్యక్రమం ఏదన్నా వుండి సిద్ధమవుతుండగా తాము వచ్చిపడ్డా మేమోనని! కారు బైటనే వుంది. డ్రైవర్ కోసం ఎదురుచూడడమో, వేరే వారి కోసం వేచి వుండడమో కాదు కదా! 'మీరు బయల్దేరుతున్నట్టున్నారు' సత్యం సగంలో ఆగిపోయాడు.

“ఉదయం పాలం వెళ్ళాల్సి వచ్చింది. సయ్‌పాల్ వచ్చాడు. వాడిని రిసీవ్ చేసుకుని హోటల్‌లో దించి ఇప్పుడే వస్తున్నాము. ఇవేళ్టికి బైటికి వెళ్ళే పనులన్నిటికీ స్వస్తి. అవతారం వచ్చాడు గదా!”

ఫోన్ మోత—

దీక్షితులు ఫోన్ దగ్గరకు వెళ్ళాడు.

“ఇవేళ స్టేట్స్‌మెన్ ఎడిటోరియల్ చూశారా? మీ మంత్రిత్వ శాఖ మీదే...”

దీక్షితులు చాలాసేపు మాట్లాడడంతో అటుపక్క వున్నది కేంద్ర మంత్రి అన్నది స్పష్టంగా తెలిసింది. సంభాషణ ఇంగ్లీషులో సాగింది. ప్రభుత్వం మీద చురకలు తగిలిస్తున్నాడు.

అవతారంకి కొత్త ప్రపంచంలో బంధించినట్టుగా

వుంది. చలికి అన్ని కిటికీలూ, తలుపులూ మూసేసి వున్నాయి. పైగా కర్టెన్‌లు. ఎన్నో ఎడారులు అక్కడ పోగయినంత శూన్యం. పిల్లలూ, పెద్దలూ ఎవరూ లేని ఇల్లు. కనీసం పిల్లులూ, కుక్కలూ కూడా లేవు. ఏ సందడీ లేదు. ఏడుపులూ, నవ్వులూ, అరుపులూ లేని నిర్జీవ వాతావరణం. కుటుంబ ఛాయలే ఎక్కడా కన్పించడం లేదు.

ఆ ఫోన్ ప్రసంగం ముగిసిన వెంటనే దీక్షితులు తనే ఎవరికో ఫోన్ చేశాడు. ఆ నంబర్ ఒకంతట దొరకలేదు. ఈసారి ఆయన ఆ పత్రిక సంపాదకునితో మాట్లాడుతున్నట్టుంది. వ్యంగ్యంగా, సంపాదకీయాన్ని మెచ్చుకుంటున్న ధ్వనితో మధ్య మధ్య నవ్వుకుంటూ



నడుస్తోంది సంభాషణ. అలాంటి సంపాదకీయాల్ని రాసే వాళ్ళని జాతి విద్రోహులని, అమెరికా ఏజెంట్లని, ప్రతిపక్షాల తొత్తులని ముద్ర వేస్తుంది అధికార పక్షం హిందూ దినపత్రిక బోఫోర్స్ వ్యవహారంలో వెల్లడించిన రహస్యాలతో, సాక్ష్యాధారాలతో, అధికార పత్రాలతో ప్రభుత్వం తలకిందులు కావలసిన పరిస్థితి గురించిన చర్చ వాళ్ళ మధ్య. ''ఇట్లాంటి ఆధారంలో ఏదో వంతు దొరికితే మేడమ్ గాంధీ పది దేశాల్లో ప్రభుత్వాలను పడగొట్టేది. అటు స్వీడన్, ఇటలీ, స్విట్జర్లాండ్, ఇంగ్లండ్ — ఇంకా సంబంధమున్న అన్ని దేశాలలో ప్రభుత్వాలు కూలిపోయేవి. జనతా పాలనలో బెల్చీ అన్న ఓ మారుమూల గ్రామంలో జరిగిన హరిజన మారణ కాండతో — ప్రతిపక్ష నాయకురాలిగా మేడమ్ గాంధీ - నిండా అయిదేళ్ళు నిండక ముందే ప్రభుత్వాన్ని మట్టి కరిపించిన నైనాన్ని చెప్పుకుని నవ్వుకుంటున్నారు ఇద్దరూ ఫోన్‌లో. ఆ సంభాషణ చివర్లో 'సయ్‌పాల్ ఉదయం దిగాడు. దేశంలో నెల రోజులు పాటు వుంటాడట. కొత్త పుస్తకం సమాచారం కోసం వచ్చాడట. వివరాలు మాటాడుకోలేదు. ఇవేళ మా డ్రైవర్ సెలవు పెట్టేడు. దాంతో నేనే వెళ్ళాల్సివచ్చింది. వాడిని హోటల్‌లో దించి వస్తున్నాను. విశాఖపట్నం నించి నా చిన్ననాటి స్నేహితుడు నా కోసం వచ్చాడు. అంచేత ఇవేళ బైట కార్యక్రమాలన్నీ రద్దు చేసుకున్నాను. మనం కలుసుకోవడం రేపటికి వాయిదా వేసుకోవచ్చుగా'' అని ముగించాడు దీక్షితులు.

తన పట్ల దీక్షితులు చూపుతున్న ఆదరాభిమానాలు అర్థమై అవతారం చిన్ననాటి చెలిమి సంతోషంతో ఉక్కిరిబిక్కిరైపోయాడు. ఫోన్‌లో మాట్లాడడం ముగిసిన తర్వాత దీక్షితులు వచ్చి అవతారం దగ్గర కూచున్నాడు.

అంతలో దాదాపు పాతికేళ్ళ వయసులో వున్న ఉత్తరాది పల్లెటూరు అమ్మాయి వేడి వేడి కాఫీలు పట్టుకుని లోపలి నించి వచ్చి వారి ముందు పెట్టింది. ముగ్గురూ కాఫీలు అందుకున్నారు.

అదే తొలిసారి దీక్షితులు పరిశీలనగా అవతారంని చూడడం.

పదమూడు పధ్నాలుగేళ్ళ అవతారం, ఇవేళ ముఖంలో, నవ్వుల్లో బాల్యపు చురుకుదనంతో, నిర్మలంగా, నిండుగా కన్పించడం దీక్షితులకు సంతోషంగా వుంది. వయస్సుకన్నా చిన్నవాడిగా, ఆరోగ్యంగా కన్పిస్తున్నాడు. ఆ పేద దుస్తులూ, నిరలంకారమైన రూపమూ నిరాడంబరమైన అందాన్నిచ్చింది. ఆ చూపులు ఎదుటివాడి హృదయాన్ని ఆత్మతో పలకరించేట్టుగా వున్నాయి.

''విశాఖపట్నం వచ్చినప్పుడల్లా నిన్ను కలుసుకోవాలనే అనుకునేవాడిని. మన కృష్ణంరాజు లేడూ, వాడు చెప్పాడు నీ గురించి- కలెక్టరాఫీస్‌లో నువు వుంటున్నట్టు.''

''ఎప్పటి మాట! కృష్ణంరాజు చచ్చిపోయి పదిహేనేళ్ళయింది.''

''కృష్ణంరాజు చనిపోయాడా?!'' అడిగాడు దీక్షితులు.

''కృష్ణంరాజు అదృష్టవంతుడు. గుండెపోటుతో చనిపోయాడు. నిజానికి గుండెపోటంతటి సుఖమైన చావు వేరొకటి వుండదనుకో'' అని సంతోషంగా చెప్పినవ్వాడు అవతారం.

చనిపోయిన తమ బాల్యమిత్రుని ఆత్మశాంతికి ఆ ఇద్దరూ హృదయపూర్వకంగా నవ్వుకున్నారు.

''కృష్ణంరాజు నవకు చెప్పకుండా వెళ్ళిపోవడం మాత్రం అన్యాయం రా అవతారం'' అన్నాడు దీక్షితులు.

''హఠాత్తుగా చావు రావడం వల్లనేమో కృష్ణంరాజు మనల్ని మరచిపోయాడు. చెప్పకుండా పెట్టకుండా వెళ్ళిపోయాడు. ఇప్పుడక్కడ ఒక్కడూ ఎంత బాధపడుతున్నాడో!'' అని మళ్ళీ ఛలోక్తివిసిరి ఇద్దరూ తృప్తిగా నవ్వుకున్నారు.

''కుటుంబానికి ఏమన్నా ఆధారం లాంటిది మిగిల్చాడా?''

''ఎక్కడి కుటుంబం! వాడి భార్య రెండు మూడేళ్ళు ముందే పోయింది.''

'అలా చెప్పు. మనతో చెప్పకుండా కృష్ణంరాజు పోవడానికి అదీ కారణం' అని పగలబడి నవ్వాడు దీక్షితులు. మళ్ళీ 'అదేమిట్రా, భర్తని వదిలేసి అట్లా ముందే వెళ్ళిపోవడం?' అన్నాడు దీక్షితులు.

'దీక్షితులూ నీకు తెలీదన్నమాట. కమల కూడా అదే పని చేసింది. దాదాపు ఇరవైయ్యేళ్ళయింది. ఎ.ని.ఎస్. కాలేజి చింతచెట్టుకన్నా ఒక్క రోజు ముందు. ఆ రోజు వర్షం రాత్రే' అని అవతారం సంతోషంగానే దరహాసవదనంతోనే చెప్పుకున్నాడు.

'ఒరేయ్ అవతారం, ఒక సంగతి చెప్పనా. కమల నిన్ను వదిలేసి భగవాన్‌తో లేచిపోయిందిరా' అని మళ్ళీ పగలబడి నవ్వాడు దీక్షితులు.

ఇద్దరూ మధ్య మధ్య కాఫీ చప్పరిస్తున్నారు. నవ్వుల మూలంగా కళ్ళల్లో నీళ్ళు వస్తుంటే తుడుచుకుంటున్నారు. సంభాషణ అందుకుని ముందుకు కొనసాగిస్తున్నారు. చూస్తున్న సత్యంకి ఆ చిన్ననాటి మిత్రుల ధోరణి వింతగా, కొన్నిసార్లు ఇబ్బందికరంగా వుంది. తన ఉనికిని వాళ్ళు గమనించినట్టు లేరు. రెండు పాత్రలు రంగస్థలం మీదికి వచ్చి మాటాడుకుంటున్నట్టుగా వుంది సత్యంకి. వాళ్ళు మాటాడుకుంటున్న విషయం ఆప్తుల మరణాల గురించి. అయితే వాళ్ళ సంభాషణలో విచారం గాని, బాధగాని, దుఃఖంగాని, సంతాప భావం గాని లేకుండా, హాస్యోక్తులతో, వ్యంగ్యాలతో, ఒకరికి మించి ఒకరు మాటాడి నవ్వుకుంటున్నారు. అంతా అయోమయం అన్పించింది సత్యంకి. ఆ మాటల వెనక దాగిన దుఃఖం అతడి మనసులో గడ్డకట్టుకుపోయి నవ్వు తెరటం తలెత్తకుండా అణచివేసింది. పురుషుని జీవితంలో భార్య మరణం కన్నా అనంతమైన వేదన ఏముంటుంది? అయినా ఆ విషాదం వాళ్ళ ముచ్చట్లలో లేదు సరికదా పరాయివారిని గురించి తమకు సంబంధించనట్టు మాటాడుకుంటున్నారు.

ఆ స్నేహితుల వయసులో సగం కూడా లేని సత్యం ఇంగ్లీషు దిన పత్రికల్లో ముఖం పెట్టుకుని, వాళ్ళను వాళ్ళ చిన్ననాటి సంతోషాలకి విడిచిపెట్టేసి మౌనంగా వుండిపోయాడు. అది గమనించిన దీక్షితులు 'సత్యం! నైట్ డ్యూటీ చేసినట్టున్నావ్ - అవునా?' అని అడిగాడు.

అవునని తలూపి 'రాత్రి అరడజన్ ఎమర్జెన్సీ కేసులు. వాటిల్లో నాలుగు ఫేలయ్యాయి. వాళ్ళలో ఒక చిన్న పిల్లవాడు. మూడేళ్ళు కూడా వుండకపోవచ్చు. బతికించలేకపోయాం. చాలా బాధనిపించింది' సత్యంని బాధించింది పిల్లవాని చావుకన్నా, నిండా ఇరవైయ్యేళ్ళు కూడా వుండని ఆ తల్లి శోకం, ఎంతకీ కళ్ళనించి చెరగిపోవడం లేదు.

'చావు భయం నిన్నింకా విడిచిపెట్టలేదంటే, నువ్వు వృత్తిపరంగా ఇంకా డాక్టర్‌వి కాలేదన్నమాట' అన్నాడు దీక్షితులు.

సత్యంకి చదువుకున్న రోజుల్నించి కూడా వైద్య వృత్తి అంటేనే పడదు. ఆ చదువు ఎందుకు చదివేనా అన్నదే అతడి సమస్య. ఆ చదువు చదివినందుకు ఇప్పుడు తప్పనిసరిగా శిక్ష అనుభవిస్తున్నట్టు అతడి బాధ. దాంతో ఉద్యోగం పట్ల రోజురోజుకీ ఉదాసీనత. డాక్టర్‌కు వుండాల్సిన వృత్తిలక్షణాలేవీ సత్యంకి సంటపట్టలేదని

స్నేహితుల విమర్శ. 'ఈ డాక్టర్ ఉద్యోగం మానేసి ఏ ఇంగ్లీషు దిన పత్రికలోనన్నా జర్నలిస్ట్‌గా చేరకూడదా, నిత్యం ఇట్లా బాధపడేకన్నా' అంటుంది అతడి భార్య.

"ఎప్పుడో ఆ వొడ్డుకే చేరుతుందీ కెరటం" అంటాడు భార్యతో సత్యం.

దీక్షితులు కోసం ఈసారి మంత్రిగారు వచ్చారు. ఆయన్ని ఇదివరలో రెండుమూడుసార్లు సత్యం ఈ ఇంట్లోనే చూశాడు. ఖరీదయిన సూట్‌లో వున్నాడు. ఇద్దరూ లోపలి గదికి పోయి, పది నిముషాలసేపు మాటాడుకుని వచ్చారు. తర్వాత ఆ మంత్రిగారు వెళ్ళిపోయారు.

"ఒకప్పుడు ఈయన గురూజీ గురూజీ అని తిరిగే వాడు. మనిషి ఎంతో మంచివాడు. రాజకీయ పార్టీ టోపీ పెట్టుకున్న తర్వాత ఈ పదేళ్ళలో వైకుంఠపాళిలో నిచ్చెన్లు దొరికి, పదవుల్లో పైపైకి వచ్చేసి ఈ స్థాయికి చేరుకున్నాడు. ఇందిరాగాంధీ మరణానంతరం ఢిల్లీలో జరిగిన మారణకాండలో ప్రముఖుడుగా పేరుపొందిన వాడు. ఏ సమావేశంలోనన్నా కలిస్తే 'వారు మా గురూజీ' అని నమస్కరించి కొత్తవారికి పరిచయం చేసినప్పుడల్లా నాకు వెన్నులో చలి పుడ్తుంది" అని మధ్య మధ్య నవ్వుకుంటూ చెప్పాడు.

"నిన్ను చూసినప్పుడు నాకెట్లా అనిపిస్తారంటే హాలివుడ్ సినిమాల్లో మాఫియా అధినేతల్లా వుంటారు" అన్నాడు దీక్షితులు.

అంతలో ఆ ఉత్తరాది అమ్మాయి రానే వచ్చింది.

"సీతా, ఏం పెడతావు మాకు తింటానికి" అని హిందీలో అడిగి ఆ అమ్మాయిని అవతారంకి పరిచయం చేశాడు దీక్షితులు. ఢిల్లీ సమీపంలో వున్న ఒక పల్లెటూరు నించి రోజూ వచ్చే ఆ అమ్మాయి తనకు గత నాలుగేళ్ళుగా వంట చేసి పెడుతున్నదట. ఆమెకి ఇద్దరు కొడుకులట. భర్త ట్రాక్టర్ డ్రైవర్. అవతారం దృష్టికి ఆ అమ్మాయి వంట మనిషిలా కన్పించలేదు. ఆ ఇంట్లో దీక్షితులు మనుమరాలు లాగ కన్పించింది. పల్లెటూరు స్త్రీలలో కనిపించే సంప్రదాయ సిద్ధమైన అందాలు ఆమె చేతి గాజుల్లో, చీరె ముసుగులో, నుదుట బొట్టులో, మెడ లోని మంగళ సూత్రంలో కన్పిస్తున్నాయి.

తన దగ్గర పదిహేనేళ్ళు పని చేసిన వంటవాడు నేపాలీ కార్తీక్ ముప్పైయ్యేళ్ళ చిన్న వయసులో చనిపోయాడట. వాడి చావు గురించి వచ్చినపుడు 'ఓ డాక్టర్ వాడిని నిలువునా చంపేశాడు' అని చెప్పి, 'కార్తీక్ పెళ్ళి చేసుకోలేదు కాబట్టి బతికిపోయాడు' అని ఆ వాక్యం లోని అర్థ వైరుధ్యానికి నవ్వాడు దీక్షితులు.

మళ్ళీ ఫోన్. ఈసారి సీతకు.

దీక్షితులు దగ్గరకు వచ్చేముందు సత్యం ఎన్నో వివరాలు చెప్పాడు. ఆ మాటల్లో దీక్షితులు కుటుంబం గురించి ఏ సంగతీ చెప్పలేదు. తనూ అడగలేదు. ఆ ఇంట్లో పిల్లలూ, పెద్దలూ ఎవరూ కనిపించకపోయేసరికి దీక్షితులునే స్వయంగా అడగాలనుకున్నాడు. ఆ పెద్ద ఇల్లు లైబ్రరీ గదిలాగ, మ్యూజియమ్ గదిలాగ వుందే తప్ప ఒక కుటుంబం నివసించే ఇల్లులా కనిపించడం లేదు. బైట కార్లు, స్కూటర్ల హారన్ మోతలు, పాలమ్ విమానాశ్రయానికి వచ్చే పోయే విమానాల రొద, మధ్య మధ్య టెలిఫోన్ సందడి. చెట్ల మీద పిట్టల అరుపులుతప్ప నిశ్శబ్దంగా వుంది.

మాటల్లో సందు దొరికించుకుని "ఒరేయ్ దీక్షితులూ, నీ కుటుంబం ఎక్కడోయ్" అని వుండబట్టలేక అడిగేశాడు అదే ప్రశ్నని వేరేవాళ్ళు తనని అడిగితే క్షమించలేని అవతారం.

"ఈ ప్రపంచమంతా మన కుటుంబమే" అన్నాడు దీక్షితులు. వెంటనే విలువైన ఒక నవ్వు నవ్వాడు.

దీక్షితులు చూపు మెట్ల గది అరుగు మీద నించున్న స్త్రీ మూర్తి నిలువెత్తు శిల్పం మీద నిల్చింది.

హుసేన్ గుర్రాలు విశాల ప్రపంచంలోకి పరుగులు తీస్తున్నాయి. శైలజ్ ముఖర్జీ గ్రామీణ వాతావరణం ఆకుపచ్చగా, నీలంగా, విశాలంగా వ్యాపిస్తోంది. రామ్ కుమార్ సిటీలాండ్ స్కేప్ తమ చుట్టూ ఆవరించిన మహా నగరంలా వుంది. ఆ మధ్యలో ఇంటి యజమాని కోసం ఎదురు చూస్తున్న కుటుంబంలా వుంది అమృతా షెర్‌గిల్ 'వనితలు' దృశ్యం. జీవితమంతా ప్రియా వియోగంతో ప్రియుని ఒంటరి జీవితం పట్ల దిగులుతో చూస్తోంది మెట్లగది అరుగుమీది స్త్రీమూర్తి.

అవతారం దృష్టి ఆ కళాఖండాల మించి దీక్షితులు మీద పడింది. 'ఆ ప్రమాదం తప్పిపోయింది జీవితంలో' అన్నాడు దీక్షితులు. తనను చూసి తనే నవ్వుకునే దీక్షితులు 'స్వంత కుటుంబం ప్రమాదం నుంచి తప్పించుకోవడం జీవితంలో గొప్పవరం. లేకపోతే సంపాదన- సంపాదన- అనుకుంటూ తుచ్ఛ యావతో పిచ్చెత్తిపోవాలి. జీవితంలో పెళ్ళి, సంతానం పెద్ద చీదర.



అంతా తమకే, తమదే అన్నట్టు మనుషులు కక్కుర్తిపడి నిత్య దరిద్రులవుతారు. శాపగ్రస్త ముఖాల్తో, జిడ్డోడులతో, దొంగ మర్యాదలతో, నటనలతో, వంచనలతో, కుళ్ళు మనసులతో, కంపు ఆలోచనలతో ఎంత అసహ్యంగా, మురికిగా తయారవుతారో మనుష్యులు" అని కుటుంబ జీవనంలో వెన్నంటి వచ్చే స్వార్థం అవగుణాల పట్ల తన అసహ్యభావాన్ని ప్రకటించాడు దీక్షితులు.

సత్యంకి దీక్షితులు అంతరాంతరాల నుంచి వస్తున్న భావజాలం కనువిప్పు లాగ తోచింది. దీక్షితులు వ్యక్తిగత జీవితం గురించి తెలుసుకునే సందర్భం ఇట్లా కుదిరినందుకు సత్యంకి సంతోషంగా వుంది. దీక్షితులు పట్ల ప్రగాఢమైన ఆరాధనా భావంతో వున్న సత్యంకి ఈ సంభాషణ ఎంతో ఆసక్తిని రేకెత్తించింది. మనసు పెట్టి దీక్షితులునే వింటున్నాడు.

దీక్షితులు ఫలహారం గురించి ఏం చెప్పకముందే సీత వెళ్ళిపోయింది.

దీక్షితులు చెప్పిందంతా వైరాగ్యం వడబోసినట్టుగా ధ్వనించింది అవతారంకి.

"అవతారం, అది సరేగాని నువ్వు ఇప్పుడు ఎక్కణ్ణించి వస్తున్నట్టు? ఇక్కడ ఈ చలికాలపు ఢిల్లీలో ఎక్కడ వుంటున్నట్టు?" అని దీక్షితులు అడిగేసరికి అవతారం చిక్కుల్లో ఇరుక్కున్నాడు. ఇల్లాంటి ప్రశ్నలు అడిగేవాళ్ళంటేనే అవతారంకి చుక్కెదురు. వెంటనే అక్కణ్ణించి అదృశ్యమైపోతాడు.

అయితే దీక్షితులు ప్రశ్నల వెనక స్నేహ హృదయం ధ్వనించి క్షమించాడు దీక్షితులుని. అయినా ఏం చెబుతాడు? నా అన్నవాళ్ళు ఎవరూ మిగలని ఈ ప్రపంచంలో గత ఏడెనిమిదేళ్ళుగా బైరాగై యాత్రలు చేస్తున్నాడు. ఇల్లాటప్పుడో ఒక కెరటం తనను మనుషుల మధ్యకు నెట్టినపుడు అతడికి ఇసికలో పడ్డ చేపలాగ వుంటుంది. వాళ్ళ మాటలు, వాళ్ళ భాష, వాళ్ళ విలువలు అతడికి అర్థం కావు. ఇవేళ ఇక్కడ మునిగితే మళ్ళీ ఎక్కడ తేలేదీ అతడికే తెలీదు.

అవతారం తన ప్రశ్నకు సమాధానం చెప్పకుండా సందేహించడం చూసి దీక్షితులు 'ఇది మన స్వంత ఇల్లు. ఈ ఇంట్లో నేను ఒక్కణ్ణే. సీత ఉదయం ఓ రెండు గంటలు, సాయంత్రం ఓ రెండు గంటలు వచ్చి పనిచేసి పోతుంది" అని క్షణం ఆగి, జ్ఞాపకాలను తిరగేసి 'ఒక అమృత హృదయం ఈ ఇల్లు కట్టిన కొత్తలో ఈ జీవితంలో అడుగుపెట్టినట్టే పెట్టి దగ్గరకు రాకుండానే శాశ్వతంగా మాయమైపోయింది" అని దీక్షితులు మెల్ల గది మూల అరుగుమీద నుంచున్న స్త్రీమూర్తి నిలువెత్తు శిల్పాన్ని చూస్తూ నిశ్శబ్దంలో మునిగిపోయాడు.

"అయితే ఇప్పుడు మరో ప్రమాదం పట్టుకుని నన్ను పీడిస్తోంది. జీవితంలో నేనెరగని నా బంధువులువచ్చి నామీద ప్రత్యేకమైన శ్రద్ధ చూపిస్తున్నారు. ముసలితనంలో నన్ను ఆదుకోవాలని" అని క్లుప్తంగా తన వర్తమాన జీవితం గురించి చెప్పుకున్నాడు దీక్షితులు.

ఢిల్లీ మహానగరంలో ముప్పైయి లక్షల రూపాయిలకు పైగా విలువ చేసే ఆ ఇల్లు దాదాపు పాతికేళ్ళక్రితం ఆ కాలనీ ఏర్పడుతున్న రోజుల్లో, ఒక స్నేహితుడి ఒత్తిడి మీద దీక్షితులు కట్టించుకున్నాడు. ఆ ఇల్లు నిర్మాణ



దశలో ఎందరెందరో మిత్రులు తోడ్పడ్డారు. ముఖ్యంగా ఒక ఆర్కిటెక్ట్ మిత్రుడు ఆది నుంచి స్వయంగా ఎంతో శ్రద్ధ తీసుకుని దాని రూపురేఖలు తీర్చిదిద్దాడు. వసంత్ విహార్ లాంటి సంపన్న నివాస ప్రాంతంలో ఆ ఇంటి నిరాడంబరమైన అందం ఆ మిత్రుని చేతి చలవే. ఒక గొప్ప కళాఖండంలా తరగని అందం ఆ బంగళా.

'సత్యం, నిన్న నా జన్మ దినోత్సవం జరుపుకున్నా. తెలుసా? అదిగో ఆ నటరాజ విగ్రహం దగ్గరున్న పుష్పగుచ్ఛం అదే. మా రాఘవ తెచ్చి ఇచ్చిపోయినాడు' అని "సీతా నిన్న రాఘవ తెచ్చిన మిఠాయి తెచ్చిపెట్టు" అని దీక్షితులు సీతని తెలుగులోనే ఆదేశించాడు. ఢిల్లీలో ప్రసిద్ధమైన ఘంటేవాలా మిఠాయి అది.

"అవతారం, నువ్వు ఇక్కడ నా దగ్గర వున్నా సదుపాయంగానే వుంటుంది. నీకు వంట చేయడం వచ్చిందనుకో, సీతకు ఓ నెల రోజులు సెలవు మంజూరు చేయవచ్చు. పాపం నేను సిటీ నుంచి బైటికి వెళ్ళేనే తప్ప సీతకు సెలవు దొరకదు"

అంతలో బ్రేక్‌ఫాస్ట్ రానే వచ్చింది.

బ్రెడ్ టోస్ట్, బట్టర్, జామ్. ఒక ప్లేట్‌లో వెజిటబుల్ సలాడ్. రెండు గ్లాసుల్లో పండ్ల రసం. ఒక గ్లాసులో మజ్జిగ. ఒక ప్లేట్‌లో మిఠాయి.

"ఇవేళ ఉప్మా చేయకపోయావా? మా అవతారం తెలుగు వంటకాలు తిని ఎన్నాళ్ళయిందో" అని ఆ స్వీట్ ప్లేట్‌ని సత్యం వేపు, అవతారం వేపు పెట్టి "ఉప్మా తర్వాత చేయవచ్చు. అవతారం నాతో వుంటాడ్లే" అని స్నేహితుడ్ని తన దగ్గర వుంచేసే అభిమానం ప్రకటించాడు దీక్షితులు.

"మన సత్యం బ్రహ్మాండమైన తెలుగు వంటకాలను రుచి చూపుతాడు. ఎప్పుడన్నా బుద్ధి పుడితే సత్యంకి టెలిఫోన్ చేసి అటు వస్తున్నా అని చెబుతా. నిర్మల ఆ రోజు సెలవ్ పెట్టి తనే స్వయంగా వండుతుంది" అని సత్యం వేపు చూసి, "సత్యం, మళ్ళీ తెలుగు భోజనం ఎప్పుడు పెడుతున్నావ్?" అని నిలదీసి అడిగాడు దీక్షితులు.

సత్యం స్నేహితులు తెలుగుదేశం నించి ఢిల్లీ వచ్చినప్పుడల్లా తెలుగు రుచులు తీసుకు వస్తూనే వుంటారు. తెలుగు ఆవకాయలు, పచ్చళ్ళు, దోసకాయలు, కారప్పొడులు, అరిసెలు, పూతరేకులు, తొక్కుడు లడ్డూలు, సున్ని వుండలూ, బందరు మిఠాయి, జీడి పప్పూ అల్లాంటివి. అవి వచ్చిన వెంటనే వాటిని పట్టుకుని సత్యం దీక్షితులు దగ్గరకు వస్తాడు.

"తెలుగుదేశం ఎంత గొప్పదో" అని మురిసిపోతాడు దీక్షితులు.

టెలిఫోన్ మోగింది.

మన దేశ పర్యటనలో ఉన్న బ్రిటిష్ మంత్రి పత్రికా సమావేశానికి సంబంధించి బ్రిటిష్ హై కమీషన్ నుంచి ఫోన్. ఆహ్వానం లాంఛనంగా ఇదివరకే అందింది. మరోసారి గుర్తు చేయడం.

సత్యం తీరిక చిక్కినప్పుడల్లా దీక్షితులు దగ్గరకు వచ్చి ఆయనతో కూచుంటాడు. మన దేశంలో ఇంగ్లీషు జర్నలిస్ట్ ప్రపంచంలో భీష్ముని లాంటి దీక్షితులు అంటే సత్యంకి ఎంతో భక్తి. ఢిల్లీ చూట్టానికి వచ్చిన స్నేహితులను రాజ్‌ఘాట్ చూపించినా చూపించకపోయినా దీక్షితుల్ని మాత్రం తప్పక దర్శించుకుని వెళ్ళాల్సిందే. ఆ ఇంట్లో ఎందరెందరో సీనియర్ జర్నలిస్టులను, వివిధ భారతీయ భాషలకు చెందిన సాహితీవేత్తలను, ప్రపంచ ఖ్యాతి పొందిన చిత్రకారులను, సంగీత వేత్తలను, దౌత్య వ్యవహర్తలను, స్వాతంత్ర్య యోధులను, మహాపురుషులను సత్యం కలుసుకున్నాడు. వాళ్ళతో మాట్లాడాడు. వాళ్ళకు సేవ చేసే భాగ్యం కూడా కలిగింది. సంపాదకుని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు మారుపేరనిపించుకున్న దీక్షితులు నిజ జీవితంలో నిరాడంబర జీవి. నిర్మల హృదయుడు, స్నేహప్రియుడు. ఓ పది రోజులు సత్యం కనిపించకపోతే "ఏమయింది సత్యం, అసలు కన్పించడమే లేదు" అని పిలిపించుకునే ప్రేమకి, ఆత్మీయతకి సత్యం గర్వపడతాడు. దీక్షితుల దగ్గర కూచుని ఆయన చెప్పే ముచ్చట్లు, అభిప్రాయాలు, అనుభవాలు వింటుంటే మహర్షి దగ్గర గురు శుశ్రూష చేసినంత సంతోషం. స్వాతంత్ర్య పోరాట కాలం నాటి చారిత్రక ఘటనలను కోటంరాజు పున్నయ్య, కోటంరాజు రామారావులు వంటి సంపాదకులు పత్రికా రంగంలో చేసిన సాహసాలను, ఆనాటి స్వాతంత్ర్య సమరయోధులు చేసిన మహోన్నత త్యాగాలను విన్నప్పుడు దేశ వర్తమాన చరిత్ర కళ్ళ ముందు భయపెడుతుంది. గంగానది మురికి కాలవై, పందులకు నిలయమైపోయినందుకు బాధ కలిగేది. దాంతో దీక్షితులుతో స్వీయచరిత్ర రాయించాలన్న దీక్ష పూనాడు సత్యం. "నీవే చేయించాలి ఆ పని" అని దీక్షితులు అభిమానులు సత్యంని ప్రోత్సహించారు.

మేనేజ్‌మెంట్‌కీ, దీక్షితులకీ ఎప్పుడూ ఏకాభిప్రాయం కుదరక పెద్ద పెద్ద దినపత్రికలలో పని చేసి చివరికి ఫ్రీ లాన్సర్‌గా వుండిపోయాడు దీక్షితులు. భారత దేశ వర్తమాన రాజకీయ పరిణామాల గురించి ప్రముఖ విదేశీ పత్రికలకు తరచు రాసే దీక్షితులు పేరు దేశంలోని కొత్తతరం పత్రికా పాఠకులకు తెలీదనే చెప్పాలి.

ఇప్పుడొచ్చిన కేంద్ర మంత్రి ఆ పని మీదే వచ్చి మాటాడేడు. గత వారం 'గార్డియన్'లో వచ్చిన దీక్షితులు వ్యాసంలో వెల్లడించిన అభిప్రాయాల గురించి చర్చించడానికి వస్తున్నట్టు ఇదివరకే ఫోన్ చేసి చెప్పాడు. మన విదేశాంగ విధానం గురించి దీక్షితులకు చదువుచెప్పి వెళ్ళాడు. అయితే ఈ మంత్రిగారు నిజం చెప్పాడు. ఈ వ్యాసం అతడు చదవలేదట. తన కార్యదర్శి ఆ వ్యాసంలోని సారంశం సంగ్రహంగా చెప్పేడట. అయితే మరి కొంతమంది- పార్లమెంట్ సభ్యులు, వాళ్ళ అనుచరులు, కార్యకర్తలు- వాళ్ళు వేరుగా ఫోన్ చేసి బెదిరించి మాట్లాడుతారు. అట్లాంటి బెదిరింపులు ఇటీవల కాలంలో వయోవృద్ధుడయిన దీక్షితులకు మామూలై పోయాయి. చిత్తశుద్ధిగల పత్రికా రచయితలకి పత్రికా రచన కత్తిమీద సాము అయిపోయింది. పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, భావ స్వాతంత్ర్యం యుగ సంధిలో నవ్వులు పాలవుతున్న మానవతా విలువలని చూస్తే నవ్వొస్తుంది దీక్షితులకు.

దీక్షితులు జీవితానికి, తన జీవితానికీ మధ్య కొట్టవచ్చినట్టుగా ఎన్నో పోలికలు కనిపించాయి అవతారంకి. ఇద్దరికీ తల్లిదండ్రులు లేరు. ఈ వయసులో సైతం తలిదండ్రులకు సేవ చేసేవాళ్ళను తను ఎందర్ని చూడలేదు! ఇద్దరికీ కుటుంబాలు లేవు. పిల్లల్లేరు, భార్యలు లేరు. బ్రహ్మచర్యంతో మిగిలిన దీక్షితులు గతీ, పెళ్ళి చేసుకుని పిల్లల్ని కని అందర్నీ కోల్పోయిన తన గతీ ఒక మోస్తరుగానే వుంది. సంతోషాలతో మునిగితేలిన రోజులు, దుఃఖంతో కుమిలిపోయిన రోజులు తను రుచి చూశాడు. దీక్షితులు జీవితంలో కూడా అవి అనుభవం అయినట్టే వున్నాయి. పెళ్ళి- పిల్లలు రూపంలో కాకపోవచ్చు. ఒక అమృత హృదయం జీవితంలో అడుగుపెట్టి శాశ్వతంగా అదృశ్యమైపోతే చాలదా! అది కూడా చావే కదా! తనలాగే దీక్షితులు కూడా మొండివాడే. ఇంకా బతుకుతున్నాడు. భార్య చనిపోయిన రోజుల్లో సముద్రంలో దూకేయాలని ఎన్నిసార్లు వెళ్ళలేదు తను! జ్ఞాపకాల ప్రాణం పొయ్యాలని బతుకుతున్నాడు. తన జ్ఞాపకాలు ఉన్నంతకాలం కమల బ్రతికే వుంటుంది చిరంజీవిగా. కమల తనతో వున్నట్టే వుంటుంది. తనతో మాట్లాడుతున్నట్టే వుంటుంది. కాలం అన్న నాణేనికి బొమ్మ -బొరుసూ చావు బతుకులు. అంతే. కమలతో తను నిత్య సంచారిగా దేశాటనలో సంతోషం పొందుతున్నాడు. ఎందుకీ దేశ దిమ్మరి బతుకు అని కమల నోటినించి వినిపిస్తే అతడు ఇంక ఈ బైరాగి జీవితానికి స్వస్తి చెబుతాడు. ఈ రోజు దీక్షితులు 'నీకు వంట వచ్చిందనుకో' అన్నప్పుడు 'ఎంతకాలమీ దేశాటన అన్నట్టు' దీక్షితులు మాట గుండెను పట్టుకుంది. కనుకే ఈ నిమిషమే తన బైరాగి బతుకు మీద తొలిసారిగా అలసట తోచింది. తన కండ్లకు నిద్ర సోకుతోంది. వేలాది దేవాలయాల్లో, పవిత్రమైన నదీ జలాల్లో, పరమ్పలలో దొరకని శాంతి దీక్షితులు స్నేహంలో దొరకడం అపురూపమైన పరిష్కారంగా తోచింది అవతారంకి. తనకు ఇల్లుంది. ఇల్లు చేరాలి.

"అవతారం, అది సరే గాని నువ్వు ఇప్పుడు ఎక్కణ్ణుంచి వస్తున్నట్టు? ఇక్కడ ఈ చలికాలపు ఢిల్లీలో నువ్వు ఎక్కడ వుంటున్నట్టు" అన్న దీక్షితులు ప్రశ్నకు అవతారంకు సమాధానం తోచింది.

"పంతులు- ఇక్కడ గ్రీన్ పార్క్‌లో వుంటాడు... తమ్ముడు... పినతల్లి కొడుకు. వాడి తల్లీ, నా తల్లీ అక్కా చెల్లెళ్ళు. ఈ ఉత్తరాదిలో యాత్రలు చేసినప్పుడల్లా ఢిల్లీ వస్తే అవతారం వాడి దగ్గరే వుంటాడు. వాడికి ఒకతే కూతురు. ఆ అమ్మాయి చచ్చిపోయింది. ఇద్దరు మనుమలు. వాళ్ళను పెంచుకుంటూ బతుకుతున్నాడు పంతులు. ఆ అల్లుడు రెండో పెళ్ళి చేసుకున్నాడు"

అక్కడే సత్యం పరిచయం అవతారంకి.

"శ్యామల స్వయంగా డాక్టర్ సెరిబ్రల్ హెమరేజ్‌తో చిన్న వయసులో చచ్చిపోయింది" సత్యం.

మళ్ళీ స్నేహితులు ఇద్దరూ పగలబడి నవ్వారు.

"డాక్టర్ అయితే చావుండదా" అని ఒక వ్యాఖ్యానాన్ని విసిరాడు దీక్షితులు.

"అంత చిన్న వయసు. ముప్పయ్యేళ్ళు కూడా వుండవు. ఇన్‌స్టిట్యూట్‌లో మేమిద్దరం ఒకేరోజున చేరాం ఉద్యోగాల్లో."

మళ్ళీ నవ్వాడు దీక్షితులు.

"చిన్న వయసులో చావుండదా సత్యం"

అవతారం గొంతు కలిపాడు ఈసారి. సత్యంకు వాళ్ళ నవ్వు అసందర్భంగా, అసభ్యంగా ధ్వనించింది. అక్కణ్ణుంచి లేచి వెళ్ళిపోవాలనుకున్నాడు. పైగా నిద్ర ముంచుకొస్తోంది. రాత్రి నిద్ర లేదు.

"చూడు సత్యం. కాలాన్ని మనం చావు పుటకలతో లెక్కకడతాం. కాని చావూ కాలమూ ఒకటే. అందుకే మన పెద్దలు కాలం చేసేడంటారు" అన్నాడు దీక్షితులు.

* * * *

ఆ రాత్రి సుమారు పది గంటలప్పుడు దీక్షితులు చదువుకుంటుండగా టెలిఫోన్. సీత తమ్ముడు ఫోన్ చేస్తున్నాడు. సీతకు ప్రమాదంగా వుందట. సిటీలో ఆస్పత్రిలో చేర్పటానికి తీసుకువెళుతున్నారట. హాస్పిటల్ దగ్గరకు రమ్మంటున్నాడు. ఆమె రాత్రి బస్సులో వస్తుంటే ఘోరం జరిగిందట. ఆమెని బస్ నించి దించి మానభంగం చేశారట.

మెట్ల గది అరుగు మీది నిలువెత్తు స్త్రీ మూర్తి శిల్పాన్ని చూసి 'ఆయుధాన్ని దించను' అనుకున్నాడు దీక్షితులు.

అంతసేపు నవ్వుకుని, సీత సాయంత్రం చేసి పెట్టి వెళ్ళిన రొట్టెలు తిని, అవతారంకి నిద్ర ముంచుకు రావడం చూసి పడుకొమ్మని చెప్పి, తను వచ్చి చదువుకుంటుండగా ఈ భయంకరమైన వార్త.

దీక్షితులకి ఆ నిమిషాన మనసు మొద్దుబారి పోయింది. అవతారంని లేపి ఆ చలిలో కారు బైటకి తీసి, సత్యం పనిచేస్తున్న ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కి దారి తీశాడు.

పొగమంచు. కండ్లలో కన్నీళ్ళు. ఆందోళనతో కొట్టుకుంటున్న గుండె. తన కలం మీదికి శత్రువు దాడి. తన కలంలో అంతర్వాహినిగా ప్రవహిస్తున్న గంగానది మీదికి శత్రువు దాడి.

అప్పుడు చందమామ మీద, ఇప్పుడు జాబిల్లి మీద. . చెట్లు కూలుతున్న దృశ్యం ●

*(డాక్టర్ కావూరి రమేష్‌బాబు దివ్యస్మృతికి)*

ప్రముఖ కవి అజంతా కవిత శీర్షికను ఈ కథ శీర్షికకు ఉపయోగించుకొన్నాను. —శ్రీపతి

## అన్వేషణ యాత్ర

అడవిలో ఆనంద దృశ్యాల్నీ, వికాస ప్రతీకల్నీ
వెతుక్కోవడం కష్టం కాదు
సముద్రంలో ఏకరీతి పోరాట నేత్రాల్ని
చూడ్డమూ కష్టం కాదు
చిక్కల్లా ఇక్కడే
ఈ మనుషుల్లోంచి
మనుషుల్ని యెంచుకోవడం లోనే -
ఎందుకూ పనికిరాని దుంగలు
ఎటుపడితే అటు వాలే కొమ్మలు
గాలి వున్నా లేకున్నా వణికే చిత్రాలు
శిలలు, బతుకు విస్మరించిన ఊపిర్లు
ఎక్కడో తప్ప కన్పడని నిజాయితీ పతాకాలు
ఇక్కడే కష్టం
నేత్రాల్ని విప్పి చూడాలి
మనసుతో స్పర్శించి చూడాలి
సమాజ నేపథ్యంలో సమీక్షించి చూడాలి
చూపుకు సానపట్టి
సంయమన కిరణాల మీదుగా సాగి చూడాలి
రెండు పాదాలుండగానే సరా?
దారి ఏ ధ్రువం వేపో చూడాలి
రెండు కన్నులుండగానే సరా?
కళ్ళ వెనుక క్షేత్రపు అన్వేషణను పట్టాలి

* * *

స్నేహపు తడి స్పందన కోసం కావచ్చు
పోరాటపు మజిలీల్లో
ముందూ వెనకల్ని చిత్రిక పట్టుకోడానికి కావచ్చు
వెన్నెల సాన్నిధ్యంలో
ద్రవ్యాని కావలి బతుకు సౌందర్యాన్ని కబుర్లాడ్డానికి కావచ్చు
మనుషుల్లో మనుషుల కోసం
ఇది నిరంతర అన్వేషణాయాత్ర
ఇక్కడ ఎంపికకు స్పృహ కావాలి
ఎంచుకున్న మనుషుల్తో సాగడానికి
మానవీయ స్పృహ మరింతగా కావాలి

—దర్భశయనం శ్రీనివాసాచార్య